క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

షాద్‌నగర్: మండల పరిధిలోని మొగిలిగిద్ద గ్రామంలో గల 33కేవీ సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా ఆదివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని పట్టణ ఏఈ వినోద్ తెలిపారు. మరమ్మతుల కారణంగా ఎలికట్ట, మహల్ ఎలికట్ట, మొగిలిగిద్ద, కందినం, ఎల్లంపల్లి, రంగంపల్లి గ్రామాల్లో ఉదయం 10.30 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయబడుతుందని ఏఈ తెలిపారు. విద్యుత్ సరఫరాలో కలిగే అంతరాయానికి వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

చదువుతోనే ఉజ్వల భవిష్యత్

విశ్రాంత డిప్యూటీ డీఈఓ స్వరాజ్‌బాబు



విద్యార్థులకు దుస్తులు అందజేస్తున్న స్వరాజ్‌బాబు

షాద్‌నగర్: విద్యార్థులు కష్టపడి చదివి బంగారు భవిష్యత్‌కు బాటలు వేసుకోవాలని విశ్రాంత డిప్యూటీ డీఈఓ స్వరాజ్‌బాబు అన్నారు. మండల పరిధిలోని దూసకల్ ప్రాథమిక పాఠశాలలో శనివారం విశ్రాంత డిప్యూటీ డీఈఓ సహకారంతో 84 మంది విద్యార్థులకు ఏకరూప దుస్తులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో స్వరాజ్‌బాబు మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరి జీవితంలో విద్యార్థి దశ అనేది ఎంతో కీలకమన్నారు. చిన్ననాటి నుంచే క్రమశిక్షణతో కూడిన విద్యను అభ్యసించాలని, తద్వారా భవిష్యత్‌లో ఉన్నత శిఖరాలను అధిరోహిస్తారన్నారు. ప్రభుత్వం, దాతలు అందిస్తున్న సహకారాన్ని విద్యార్థులు పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం రేవతి, ఉపాధ్యాయులు అన్నపూర్ణ, శైలజ, బుద్ధదేవ్, రెడ్యాలాల్, సంతోష్‌బాబు, శ్రీనివాసులు, సర్వరాజ్ అన్వర్ తదితరులు పాల్గొన్నారు.

అధికారులకు సన్మానం



తహసీల్దార్, డిప్యూటీ తహసీల్దార్‌ను సన్మానిస్తున్న ముస్లింలు

శంకర్‌పల్లి: ఈ నెల 3, 4, 5 తేదీలలో పట్టణంలో 'ఇస్తేమా' కార్యక్రమం నిర్వహించిన విషయం తెలిసిందే. అయితే ఈ కార్యక్రమానికి ఉమ్మడి రంగారెడ్డి జిల్లాతో పాటు చుట్టూ పక్కల జిల్లాల నుంచి పెద్దఎత్తున ముస్లింలు తరలివచ్చారు. వారికి ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ప్రభుత్వం తరఫున పకడ్బందీ ఏర్పాట్లు చేసినందుకుగాను పట్టణానికి చెందిన ముస్లింలు శనివారం శంకర్‌పల్లి తహసీల్దార్ సురేందర్, డిప్యూటీ తహసీల్దార్ బాలకృష్ణారెడ్డి, మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్‌ను కలిసి ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఎండీ ఎజాస్, సమీ ఖురేషి, ఆరిఫ్ తదితరులు పాల్గొన్నారు.

సీసీరోడ్డు పనులు ప్రారంభం



పనులను ప్రారంభిస్తున్న కౌన్సిలర్

షాద్‌నగర్: మున్సిపాలిటీ పరిధిలోని సోలీపూర్ గ్రామంలో శనివారం కౌన్సిలర్ కృష్ణవేణి మున్సిపాలిటీ నిధులు రూ.5లక్షల వ్యయంతో చేపట్టనున్న సీసీరోడ్డు నిర్మాణ పనులను ప్రారంభించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ పులిమామిడి శ్రీశైలం, నాయకులు సింగపాగ లక్ష్మయ్య, అనిల్‌కుమార్, కృష్ణయ్య, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

మార్కెట్ కమిటీ డైరెక్టర్‌కు సన్మానం



పాండుయాదవ్‌ను సన్మానిస్తున్న నాయకులు

చేవెళ్ల/మొయినాబాద్: గుడిమల్కాపూర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్‌గా ఎన్నికైన పాండుయాదవ్‌ను శనివారం మండల పరిధిలోని రామన్నగూడ మాజీ సర్పంచ్ నడిమొల్ల లావణ్యశంకర్ సన్మానించారు. కార్యక్రమంలో పీసీసీ సంయుక్త కార్యదర్శి శ్రీనివాస్‌గౌడ్, మాజీ సర్పంచ్ బాలయ్య, చేవెళ్ల మార్కెట్ కమిటీ డైరెక్టర్ జనార్దన్, నాయకులు వెంకటేశ్, విష్ణు, బాబు, మాణిక్యం, సత్య, మల్లేశ్ తదితరులు ఉన్నారు.

అధ్వాన దారులతో అవస్థలు

- రెండునెలల క్రితం అధునాతన యంత్రాలతో గుంతలు పూడ్చే విధానం ప్రారంభం
- ఆ తర్వాత అటకెక్కిన రోడ్ల మరమ్మతులు
- వాహనదారులకు తప్పని తిప్పలు
- పట్టించుకోని అధికారులు



అధ్వానంగా పెద్దమంగళారం రోడ్డు

మొయినాబాద్: నూతన టెక్నాలజీతో రాష్ట్ర వ్యాప్తంగా రోడ్లపై ఏర్పడిన గుంతలను యుద్ధప్రాతిపదికన పూడ్చేస్తాం. అధునాతన ఎయిర్ ప్రెషర్ జెట్ ప్యాచర్, పాట్‌హోల్ అండ్ రోడ్ మెయింటెనెన్స్ యంత్రాలతో రోడ్లపై గుంతలు పూడ్చి రెండేళ్లలో రోడ్లను అభివృద్ధి చేస్తాం.. గత నవంబర్ 11న చిలుకూరు రోడ్డులో నూతన టెక్నాలజీ యంత్రాలతో గుంతలు పూడ్చే విధానాన్ని ప్రారంభించిన సందర్భంగా రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి చెప్పిన మాటలివి.

ఆర్భాటంగా ప్రారంభించి..

నూతన టెక్నాలజీతో రోడ్లపై ఏర్పడిన గుంతలు పూడుస్తామని రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ప్రారంభించిన కార్యక్రమం అటకెక్కింది. అమెరికాలో అమలవుతున్న విధానాన్ని తెలంగాణలోనూ అమలు చేయాలని ప్రభుత్వం గతేడాది నవంబర్‌లో మొయినాబాద్ మండలంలోని చిలుకూరు బాలాజీ దేవాలయం వెళ్లే రోడ్డులో పైలెట్ ప్రాజెక్టుగా ప్రారంభించింది. ఎయిర్ ప్రెషర్ జెట్ ప్యాచర్, పాట్‌హోల్ అండ్ రోడ్ మెయింటెనెన్స్ విధానంతో అధునాతన యంత్రాలతో గుంతలు పూడ్చే విధానాన్ని మొదలుపెట్టారు. ఈ యంత్రాలతో రోజుకు సుమారు 20 కిలోమీటర్ల దూరం గుంతలు పూడ్చవచ్చు. రాష్ట్రంలోని ఆర్‌అండ్‌బీ, పంచాయతీరాజ్ రోడ్లపై ఏర్పడిన గుంతలన్నీ యుద్ధ ప్రాతిపదికన పూడ్చేందుకు ఈ విధానాన్ని అమలు చేస్తున్నట్లు మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ప్రారంభోత్సవం సందర్భంగా చెప్పారు. అయితే ఆ తర్వాత రోడ్లపై గుంతలు పూడ్చే కార్యక్రమం ఎక్కడా జరగడం లేదు. ఆరంభశూరత్వంగా ప్రారంభించిన కార్యక్రమం కొనసాగకుండా మరుగునపడింది. ఆ రోజు తీసుకొచ్చిన గుంతలు పూడ్చే నూతన టెక్నాలజీ యంత్రం సైతం కనిపించకుండా పోయింది.

అధికారులకే తెలియని వైనం..

నూతన టెక్నాలజీ యంత్రాలతో రోడ్లపై గుంతలు పూడ్చే విధానం ఎందుకు కొనసాగడంలేదో అధికారులకే తెలియకుండా పోయింది. ప్రతిష్ఠాత్మకంగా ఈ విధానాన్ని ప్రారంభించిన అధికారులు ఆ తర్వాత ఎందుకు వదిలేశారో తెలియడం లేదు. ఈ విషయమై ఆర్ అండ్‌బీ, పంచాయతీరాజ్ అధికారులను వివరణ కోరగా.. తమకు తెలియదని ఉన్నతాధికారులనే అడగాలని సమాధానమిస్తున్నారు.

అడుగడుగునా గుంతలే...

నూతన టెక్నాలజీతో గుంతలు పూడ్చే యంత్రంతో చిలుకూరు, హిమాయత్‌నగర్ గ్రామాల వద్ద కొద్దిదూరం గుంతలు పూడ్చారు. అదే రోడ్డుపై ఇంకా చాలా గుంతలు ఉన్నా వాటిని మాత్రం ఇప్పటివరకు పూడ్చలేదు. మంత్రి వచ్చిన రోజే అధికారులు హడావిడిగా యంత్రంతో రెండు, మూడు గుంతలు పూడ్చి ఆ తర్వాత పట్టించుకోకుండా వదిలేశారు. దీంతో చిలకూరు రోడ్డులో సుమారు పది కిలోమీటర్ల దూరం అడుగడుగునా గుంతలే ఏర్పడ్డాయి. అదేవిధంగా మండలంలోని చాలా గ్రామాల రోడ్లు పూర్తిగా గుంతల మయంగా మారి వాహనదారులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.



యంత్రంతో గుంతలు పూడ్చుతున్న విధానాన్ని పరిశీలిస్తున్న మంత్రి కోమటిరెడ్డి(ఫైల్)

మరమ్మతులు చేపట్టాలి



రెండు నెలల క్రితం రోడ్లపై ఏర్పడి గుంతలు పూడ్చే కార్యక్రమాన్ని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి చిలుకూరు వద్ద ప్రారంభించారు. ఇప్పటివరకు రోడ్లపై గుంతలు పూడ్చలేదు. ఆ రోజు తెచ్చిన యంత్రం మళ్లీ కనిపించకుండా పోయింది. రోడ్ల మరమ్మతులపై ప్రభుత్వానికి, అధికారులకు చిత్తశుద్ధి లేదు. రోడ్లపై ఏర్పడిన గుంతలతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇకనైనా అధికారులు స్పందించి రోడ్లకు మరమ్మతులు చేపట్టాలి.

\- గున్నాల గోపాల్‌రెడ్డి, చిలుకూరు

రామేశ్వరంలో పూజ సామగ్రికి వేలం



వేలం పాటలో పాల్గొన్న దేవాలయ అధికారులు, గ్రామపెద్దలు

షాద్‌నగర్‌రూరల్: ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని రామేశ్వరంలో గల ఉత్తర రామలింగేశ్వర స్వామి దేవాలయ ఆవరణలో శనివారం దేవాదాయ, ధర్మాదాయశాఖ అధికారులు బహిరంగ వేలం పాట నిర్వహించారు. దేవాదాయ, ధర్మాదాయశాఖ ఇన్‌స్పెక్టర్ మోహన్‌రెడ్డి పర్యవేక్షణలో కొబ్బరికాయలు, పూజ సామగ్రి, లడ్డూ, పులిహోర, తలనీలాలకు వేలం పాట చేపట్టారు. ఈ సందర్భంగా వేలం పాటలో రామేశ్వరంకు చెందిన హన్మంతు కొబ్బరికాయలు, పూజ సామగ్రి అమ్ముకునేందుకు రూ.36లక్షల 10వేలు, రాజేంద్రప్రసాద్ లడ్డూ, పులిహోర అమ్ముకునేందుకు రూ.25లక్షలు, నాగర్‌కర్నూల్ జిల్లా అచ్చంపేటకు చెందిన ఏడుకొండలు తలనీలాలు సేకరించేందుకు రూ.2లక్షల 9వేల 999లకు టెండర్‌ను దక్కించుకున్నారు. టెండర్‌ను దక్కించుకున్న వాళ్లు 2025 ఫిబ్రవరి 1 నుంచి 2026 జనవరి 31 వరకు అమ్ముకోవచ్చని, తలనీలాలు సేకరించుకోవచ్చని మోహన్‌రెడ్డి తెలిపారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తల మండలి సభ్యుడు రవీందర్‌రావు, ఈఓ శివకుమార్, గ్రామపెద్దలు వెంకట్‌రెడ్డి, సంపత్‌కుమార్, మోహన్‌రెడ్డి, ఆశన్నగౌడ్, రాయికల్ శ్రీనివాస్, మల్లేశ్, హన్మంతు, కృష్ణయ్య, కిరణ్‌కుమార్, రాజు, ఆలయ సిబ్బంది మాధవులు, దేవేందర్‌రెడ్డి, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

సాగు భూములకే రైతు భరోసా

ఏఓ నిషాంత్‌కుమార్



షాద్‌నగర్‌రూరల్: గూగుల్ మ్యాప్‌లో భూముల వివరాలను పరిశీలిస్తున్న అధికారులు

షాద్‌నగర్‌రూరల్: ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న రైతుభరోసా పథకంలో సాగుకు యోగ్యమైన భూములన్నింటికీ రైతుభరోసా అందుతుందని మండల వ్యవసాయాధికారి(ఏఓ) నిషాంత్‌కుమార్ అన్నారు. శనివారం ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని ఎలికట్ట, చౌలపల్లి, చింతగూడ, మధురాపూర్ గ్రామాల్లో ఏఓ రెవెన్యూ అధికారులతో కలిసి భూములను పరిశీలించారు. ఈ సందర్భంగా ఏఓ మాట్లాడుతూ.. వ్యవసాయం చేసేందుకు అనువుగా ఉన్న భూములకే రైతు భరోసా అందిస్తుందన్నారు. వ్యవసాయ యోగ్యంకాని భూములను రైతు భరోసా జాబితా నుంచి తొలగిస్తామని పేర్కొన్నారు. గ్రామాల్లోని భూములను గూగుల్ మ్యాప్ ద్వారా గుర్తిస్తున్నామని, వాటన్నింటి వివరాలను గ్రామంలో నిర్వహించే గ్రామసభలలో చర్చించి ప్రజల ఆమోదం తీసుకుంటామన్నారు. వ్యవసాయేతర భూములుగా మార్చిన వాటికి రైతు భరోసా పథకం వర్తించదన్నారు. కార్యక్రమంలో ఆర్‌ఐలు సలీం, రోజారాణి, ఏఈఓలు తేజ్‌కుమార్, ప్రణీత, రాంబాబు, మహేందర్‌గౌడ్, గోవర్ధన్, పంచాయతీ కార్యదర్శి తేజస్విని తదితరులు పాల్గొన్నారు.

భూముల పరిశీలన

మొయినాబాద్‌రూరల్: వ్యవసాయ యోగ్యం కాని భూములను పరిశీలిస్తున్నామని తహసీల్దార్ గౌతమ్‌కుమార్, మండల వ్యవసాయ అధికారి అనురాధారెడ్డి పేర్కొన్నారు. శనివారం మండల పరిధిలోని చిన్నమంగళారం, వీరన్నపేట్, కనకమామిడి గ్రామాల్లో అధికారులు వ్యవసాయ యోగ్యం కాని భూములను పరిశీలించి నమోదు చేశారు. ఈ సందర్భంగా చిన్నమంగళారంలో మండల తహసీల్దార్ గౌతమ్‌కుమార్ రైతులతో సమావేశం నిర్వహించారు. అదేవిధంగా కనకమామిడిలో మండల వ్యవసాయాధికారి రైతులతో మాట్లాడారు. అనంతరం వారు మాట్లాడుతూ.. ప్రభుత్వం చేపట్టిన రైతు భరోసా కార్యక్రమంలో రైతులకు సంబంధించిన భూములను క్షుణ్ణంగా పరిశీలించి ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నామన్నారు. సాగుకు పనికిరాని భూములను పథకం నుంచి తొలగిస్తామన్నారు. కార్యక్రమంలో ఆర్‌ఐ సుజిత్‌రెడ్డి, ఏఓ ప్రవీణ్, సునీల్, చిన్నమంగళారంలో మండల సర్వేయర్ జలజ, ఏఓ కుమార్, రైతులు పాల్గొన్నారు.

కేటీఆర్.. అబద్ధాలు మానుకో

కాంగ్రెస్ పార్టీ చేవెళ్ల అసెంబ్లీ ఇన్‌చార్జి పామెన భీంభరత్



షాబాద్‌లో రైతు దీక్ష చేసిన స్థలాన్ని కల్లాపి చల్లి శుభ్రం చేస్తున్న నాయకులు

షాబాద్: కేటీఆర్ అబద్ధపు మాటలు, ప్రజలను మోసం చేయడం మానుకోవాలని కాంగ్రెస్ పార్టీ చేవెళ్ల అసెంబ్లీ ఇన్‌చార్జి పామెన భీంభరత్ ఆరోపించారు. శనివారం మండల కేంద్రంలో కేటీఆర్ నిర్వహించిన రైతు దీక్ష, ధర్నా నిర్వహించిన సభ స్థలంలో చీపుర్లతో శుభ్రం చేసి కల్లాపి చల్లి నేలను శుద్ధి చేశారు. అనంతరం పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా భీంభరత్ మాట్లాడుతూ.. ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని తమ ప్రభుత్వం నెరవేరుస్తుందన్నారు. ప్రతి రైతుకు రైతు భరోసాగా ఎకరాకు ఏటా 12 వేల రూపాయలు అందిస్తామన్నారు. 25 లక్షల మంది రైతులకు రూ.21వేల కోట్ల రుణమాఫీ చేసిన ఘనత సీఎం రేవంత్‌రెడ్డికే దక్కుతుందని పేర్కొన్నారు. సర్దార్‌నగర్ మార్కెట్ కమిటీ చైర్మన్ పీసరి సురేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారంటీలను అమలు చేసి తీరుతామని హామీనిచ్చారు. గతంలో ఎప్పుడు లేని విధంగా విద్యార్థులకు డైట్ చార్జీలు పెంచిందన్నారు. అర్హులైన అందరికీ కొత్త రేషన్ కార్డులు ఇస్తామన్నారు. పీసీసీ రాష్ట్ర కార్యదర్శులు గౌరీ సతీష్, ఎన్.రాంరెడ్డి మాట్లాడుతూ.. బీఆర్‌ఎస్ చేసిన తప్పులను కప్పిపుచ్చుకుంటూ ఉనికిని కాపాడుకునేందుకు దొంగదీక్షలు చేస్తున్నారని వాటిని మానుకోవాలని సూచించారు. గత 10 ఏళ్లలో నిరుద్యోగులను వీధిన పడేశారని విమర్శించారు. 200ల యూనిట్ల వరకు ప్రతి ఇంటికి ఉచిత కరెంటు, 500ల రూపాయలకే గ్యాస్ కనెక్షన్లు, ఉచిత బస్సు సౌకర్యం కల్పిస్తున్నామన్నారు. ప్రజా సంక్షేమమే ధ్యేయంగా కాంగ్రెస్ ప్రభుత్వం నిరంతరం పని చేస్తుందన్నారు. కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకులు చల్లా మాధవరెడ్డి, హస్మత్‌పాషా, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు అక్తర్‌పాషా, యాదయ్య, షాబాద్ మండల వర్కింగ్ ప్రెసిడెంట్లు మంగల్లి చెన్నయ్య, పామెన నర్సింహులు, జిల్లా ప్రధాన కార్యదర్శి పామెన భార్గవ్‌రామ్, చేవెళ్ల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు పెంటారెడ్డి, మండల యూత్ అధ్యక్షుడు సురేష్, మాజీ ఎంపీటీసీలు కుమ్మరి చెన్నయ్య, అశోక్, మల్లేశ్, నాయకులు పీసరి వెంకట్‌రెడ్డి, ఆశ్వక్‌అల్లీ, బాల్‌రాజ్, బాస నర్సింహులు, వెంకట్‌రెడ్డి, మల్లారెడ్డి, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

ముదిరాజ్‌లను బీసీ-ఏలోకి చేర్చాలి

మొయినాబాద్: ముదిరాజ్‌లను బీసీ–డీ నుంచి బీసీ–ఏలోకి చేర్చాలని డాక్టర్ శివ ముదిరాజ్ డిమాండ్ చేశారు. ముదిరాజ్‌లను బీసీ-ఏకి మార్చాలని చేపడుతున్న ముదిరాజ్ ప్రజా చైతన్య బస్సు యాత్ర శనివారం చేవెళ్లకు చేరుకుంది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎన్నికల ముందు సీఎం రేవంత్‌రెడ్డి ముదిరాజ్‌లకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలన్నారు. ముదిరాజ్ కార్పొరేషన్‌కు రూ.2వేల కోట్లు నిధులు కేటాయించాలన్నారు. బీసీల రిజర్వేషన్లు అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు నర్సింలు, శ్రీనివాస్, గోపాల్, రాంప్రసాద్, గణేశ్, కృష్ణమోహన్, నరేశ్, శివకుమార్, భార్గవ్, రాజు, జనార్దన్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న శివముదిరాజ్

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్



సర్వేపై మహిళలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

నందిగామ: అర్హులందరికీ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వర్తింపజేస్తామని స్థానిక ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. మండలంలోని అప్పారెడ్డిగూడ, వీర్లపల్లి, మామిడిపల్లి, మొదళ్లగూడ గ్రామాల్లో శనివారం ఆయన పర్యటించారు. ఇందులో భాగంగా గ్రామాల్లో రైతు భరోసా, కొత్త రేషన్‌కార్డులు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, ఇందిరమ్మ ఇళ్ల అర్హులను గుర్తించేందుకు అధికారులు చేపడుతున్న సర్వేను పరిశీలించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అర్హులందరికీ అందుతాయన్నారు. గత ప్రభుత్వం కేవలం ఉచిత, ఆచరణ సాధ్యం కానీ హామీలు ఇచ్చి ప్రజలను మోసం చేసిందని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను విడతల వారీగా అమలు చేసేందుకు సీఎం రేవంత్‌రెడ్డి నిరంతరం కృషి చేస్తున్నారన్నారు. పాత జాతీయ రహదారి చంద్రయాన్‌గూడ నుంచి మామిడిపల్లి గ్రామం వరకు రూ.30 కోట్లతో రోడ్డును అభివృద్ధి చేస్తున్నామన్నారు. రోడ్డు విస్తరణకు ప్రజలు, వ్యాపారులు సహకరించాలని కోరారు. దివ్యాంగుల సౌకర్యార్థం షాద్‌నగర్ పట్టణంలో త్వరలో సదరం క్యాంపును ఏర్పాటు చేస్తామన్నారు. అనంతరం మామిడిపల్లిలో సీసీరోడ్డు, మజీద్‌మామిడిపల్లి గ్రామంలో రాష్ట్రస్థాయి వాలీబాల్ టోర్నమెంట్‌ను ఎమ్మెల్యే ప్రారంభించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ శివశంకర్‌గౌడ్, నాయకులు జంగ నర్సింహ, నవీన్‌గౌడ్, రాజుగౌడ్, కొమ్ము కృష్ణ, చంద్రపాల్‌రెడ్డి, రాంరెడ్డి, కుమారస్వామిగౌడ్, మల్లేశ్, అన్వర్, ప్రభాకర్, వెంకట్‌చారి, సీతారాం, కృష్ణ, ఎంపీడీఓ సుమతి తదితరులు పాల్గొన్నారు.

ఎన్టీఆర్ సేవలు చిరస్మరణీయం



మొయినాబాద్‌రూరల్: నివాళులర్పిస్తున్న విద్యాసంస్థల డీన్ రామారావు, అధ్యాపకులు

మొయినాబాద్‌రూరల్: తెలుగు జాతి ఆత్మగౌరవాన్ని పలు దిశలు చాటిన మహనీయుడు స్వర్గీయ నందమూరి తారక రామారావు సేవలు చిరస్మరణీయమని ఎన్టీఆర్ విద్యాసంస్థల డీన్ రామారావు అన్నారు. శనివారం నందమూరి తారక రామారావు వర్ధంతి సందర్భంగా మండల పరిధిలోని హిమాయత్‌నగర్ రెవెన్యూ పరిధిలో గల గండిపేట కుటీరంలో ఎన్టీఆర్ విగ్రహానికి విద్యాసంస్థల బృందం, విద్యార్థులు కలిసి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో డైరెక్టర్ వెంకటేశ్వర్‌రావు, ప్రిన్సిపాల్ శ్రీనివాస్‌రావు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

చేవెళ్లలో..

మొయినాబాద్: మాజీ ముఖ్యమంత్రి స్వర్గీయ నందమూరి తారక రామారావు వర్ధంతిని శనివారం నాయకులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చేవెళ్ల మండల కేంద్రంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఎన్టీఆర్ చేసిన సేవలను గుర్తుచేసుకున్నారు. కార్యక్రమంలో నాయకులు వెంకటేశ్‌గౌడ్, సుభాన్, రాఘవులు, శ్రీహరియాదవ్, గౌతమ్, ధర్మయ్య, కృష్ణయాదవ్, మల్లారెడ్డి, మాణిక్యం ఉన్నారు.

సీపీఐ జెండా ఆవిష్కరణ



జెండా ఎగురవేస్తున్న నాయకులు

మొయినాబాద్: సీపీఐ వంద వసంతాల ఉత్సవాల సందర్భంగా శనివారం చేవెళ్ల మండల పరిధిలోని నారాయణదాసుగూడలో ఆ పార్టీ నాయకులు సీపీఐ జెండా ఆవిష్కరించారు. ఎర్రజెండాను ఎగురవేసి కమ్యూనిస్టుల పోరాటాన్ని గుర్తుచేసుకున్నారు. ఈ సందర్భంగా సీపీఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు రామస్వామి మాట్లాడుతూ.. కమ్యూనిస్టు పార్టీ నిరంతరం ప్రజల సంక్షేమం కోసం పోరాటం చేస్తుందన్నారు. వందేళ్లుగా ప్రజల పక్షాన పోరాడుతూ ఉద్యమాలు నడిపింది కమ్యూనిస్టులేనన్నారు. వందేళ్ల ఉత్సవాలను విజయవంతంగా నిర్వహించాలన్నారు. ఈ నెల 28న చేవెళ్లలో జరిగే పార్టీ జనరల్ బాడీ సమావేశాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి సత్యనారాయణ, మండల పార్టీ కార్యదర్శి సత్తిరెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

హామీలు అమలు చేయాలి

సీపీఐ జిల్లా కార్యదర్శి పాలమాకుల జంగయ్య



మాట్లాడుతున్న జంగయ్య

షాబాద్: కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారంటీలను అమలు చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి పాలమాకుల జంగయ్య డిమాండ్ చేశారు. శనివారం మండల కేంద్రంలోని ముదిరాజ్ భవన్‌లో సీపీఐ మండల కార్యదర్శి నక్కలి జంగయ్య అధ్యక్షతన సీపీఐ మండల కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. ఈ నెల 28న కేజీఆర్ గార్డెన్‌లో చేవెళ్ల నియోజవర్గ జనరల్ బాడీ సమావేశం ఉంటుందని చెప్పారు. ఈ సమావేశానికి సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనమనేని సాంబశివరావు ముఖ్య అతిథిగా హాజరవుతున్నారన్నారు. ఈ జనరల్ బాడీ సమావేశానికి చేవెళ్ల నియోజకవర్గంలోని చేవెళ్ల, షాబాద్, మొయినాబాద్, శంకర్‌పల్లి, నవాబుపేట మండలాల నుంచి పార్టీ కార్యకర్తలు, ప్రజాసంఘాల కార్యకర్తలు తరలిరావాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. జిల్లాలో అర్హులైన పేదలందరికీ ఇందిరమ్మ ఇళ్లు, రేషన్ కార్డులు ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర సమితి సభ్యుడు కే. రామస్వామి, మండల నాయకులు రాములు, శ్రీశైలం, నారాయణ, రుక్కయ్య, నర్సయ్య ఉన్నారు.

ఉచిత వైద్య శిబిరం

షాబాద్: ప్రజలు ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని వెల్స్‌పన్ ఫౌండేషన్ సీఎస్‌ఆర్ హెడ్ సురేఖ, ఫౌండేషన్ ప్రాజెక్టు మేనేజర్ భద్రయ్య పేర్కొన్నారు. శనివారం మండల కేంద్రంలోని అంబేడ్కర్ భవన్‌లో ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఎల్వీప్రసాద్ కంటి ఆస్పత్రి వారి సంయుక్త ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్యశిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో సుమారు 120 మంది పాల్గొని కంటి పరీక్షలు చేయించుకున్నారు. ఇందులో 20 మందిని ఆపరేషన్ కోసం, మరో 26 మందిని కంటి అద్దాల కోసం గుర్తించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ క్రమం తప్పకుండా కంటి పరీక్షలు చేయించుకొని, కంటి వైద్యులు సూచించిన విధంగా అద్దాలు వాడడం లేదా, అవసరమైన వారు ఆపరేషన్ చేయించుకోవాలని సూచించారు. పోషకాహారం తీసుకోవడం ద్వారా కంటి సమస్యలను దూరం చేయొచ్చని తెలిపారు. కార్యక్రమంలో బీసీఐ మేనేజర్ పవన్‌కుమార్, వైద్య సిబ్బంది, గ్రామస్తులు ఉన్నారు.